29102023-DIS-13_Layout 1 10/29/2023 3:36 AM Page 1

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...

editpage@ntnews.com

అసిపె (పొది)లో అక్షర సవ్వడులు

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో కులాలు, వర్గాలు, వాదాలుగా తమ అస్తిత్వాన్ని ఎలుగెత్తి చాటాయి. సాహిత్యంలో తన ప్రత్యేక అస్తిత్వాన్ని బలంగా రాసి సంకలనాలుగా ముద్రించాయి. మంగలి అస్తిత్వ సాహిత్యం ప్రత్యేకంగా ఇప్పటికీ రాలేదు. ఇప్పటి వరకు 'అడపం' పేరుతో డాక్టర్ తుమ్మల రామకృష్ణ కథా సంకలనం తెచ్చిండు. బీసీలు, ఇతర మిత్రుల కవితా సంపుటాలలో, సంకలనాలలో క్షౌరవృత్తి, వాయిద్య, వైద్య సాహిత్యం నమోదైంది. కొందరు కవులు, రచయితలు కుల అస్తిత్వ అనుభవం నుంచి రాసిండ్రు. మరికొందరు కవులు కులేతర సానుభూతితో పద్యాలు కవితలు, పాటలు, నవల, పరిశోధన వ్యాసాలు, కథలద్వారా వృత్తి ప్రాధాన్యాన్ని చిత్రీకరించారు.

ప్రపంచీకరణలో మానవుడు తన ఉనికిని తాను వెతుక్కుంటున్నాడు. చరిత్రలో తను కోల్పోయిన స్థానాన్ని, తన జాతి మూలాల్ని, హక్కుల్ని, పొందవలసిన గౌరవాన్ని ఇప్పుడిప్పుడే గొంతెత్తి చాటుతున్నాడు. విద్య, సామాజిక రాజకీయ రంగాలలోనే కాదు సాహిత్య రంగంలోనూ వెనుకబడినకులం మంగలి నాయీబ్రాహ్మణులే. తెలుగు సాహిత్యంలో మంగలి కులవృత్తి జీవితాలపై ఒక కవితా సంకలనం రాలేదంటే సాహిత్యంలో వారెంత వెనుకబడి ఉన్నారో అర్థమవుతున్నది. బీసీకవుల సాహిత్యాన్ని పరిశీలిస్తే వారి వృత్తి బాధలు మనకు అర్థమవుతాయి.

> అగ్రహారంలోనే కాదు. మంగలి అసిపె (పొది)లోనూ సాహిత్యం నక్షత్రాలై మెరువాలి. అక్షరాలు అక్షరంతో ఢీ కొనాలి. కత్తుల్ని కలాలుగా మలవాలి. తరతరాల వెనుకబాటు, వివక్షను ఎదుర్కోవాలంటే విస్తృతంగా సాహిత్యాన్ని నాటాల్సిందే.

కులపరంగా సాంఘిక వివక్ష. కులం పేరు మార్చుకుంటే పెరిగిన గౌరవం, ఆదాయం ఎలాంటిదో ఎరుక చేస్తూ, పరాయీకరణను బద్దలు చేస్తూ, అగ్రవర్ణ భావజాలాన్ని బలంగా ప్రశ్నించారు ఉ.సాంబ శివరావు (ఉ.సా.) కొండమంగలి కత్తి కవితలో. వాడి పేరు చివర కులం పేరు అలంకార భూషణం/నా పేరు చివర కులం పేరు అవమాన ఘోషణం అంటారాయన. జి.శివరామకృష్ణ తన గోరుగల్లు కవితలో..'పొద్దు పాము తరుముతుంటే పరిగెత్తి పోయి / పరుపుమీద ఇంకా పొర్లాడుతున్న వాడి గుమ్మంలో గంటనై మోగాలా/..అంటూ తన ధిక్కార స్వరాన్ని వినిపించారు.

కవి సీతారాం తన 'ఓట్లు ఓట్లో నాయీబ్రాహ్మణ ఓట్లోయ్' అనే కవితలో 'నా గుండె మంగలి కత్తి నూరే రాయై పోయింది' అని ఆవేదన చెందుతాడు. జి.లక్ష్మీ నరసయ్య (వరదయ్య) ఇరుసు విరిగిన బండి కవితా సంపుటిలో 'కలలు సానబట్టు కుంటూ' అనే కవితలో 'నేను పె లం జేస్తే పైరుకు బదులు బొచ్చు కత్తులు పొడుచుకు నిలబడుతాయని/మీరంతా చక్క గా సెల విచ్చారు/మీకు థాంక్స్/ 'చాకలి మంగలి పాత్తు/ఇంటికి రాదిత్తు'/అని అంత్య ప్రాసను అందంగా నాటిన / పండితులారా.. అంటూ ఆవేదనాత్మక స్వరమై ప్రశ్నించాడు.



జి.విజయలక్ష్మి రాసిన 'పొది' కవితలో మంగలి వెంకటిగాడివి నువ్వు / కొండమంగలి గాడి పెళ్లాన్ని నేను/నాయీబామ్మడివే /అన్యాయం అని అరువలేవు అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. డాక్టర్ రాపోలు సుదర్శన్ 'సృష్టిలో ఏ బిడ్డకైనా మంత్రసాని మంగలి మహిళనే పురుడు పోసేది. పురుడు పోసుకున్న ప్రతిబిడ్డ ఈ భూ మీద తొలిసారి చూసింది మంగలి స్త్రీనే.' అని తన 'అమంగళం' అనే కవితలో బలంగా ధిక్కార వైతన్య కవిత. చెప్పిన 'ఔ మల్ల మా అయ్యన్నట్టే అన్ని మారినయ్/మా అయ్య వాడిన మంగలి కలప జాడ లేకుండా పోయింది/పాతకాలపు కత్తులు, గోరుగాల్ మారి ట్రిమ్మర్లు అచ్చి నయ్' అంటూ ఆధునికీకరణ వల్ల వచ్చిన మార్పులను సొన్నాయిల కృష్ణవేణి 'మారని బతుకు' కవితలో ఏకరవు పెట్టింది.

వనపట్ల సుబ్బయ్య (వ్యాసకర్త) నాది ఊరు మ్మడి సేవలో తేలే కుర్చీ/నా కుర్చీది సామాజిక సేవాభావం/నాది కష్టజీవుల చమట చుక్కల కుర్చీ/ అరవై ఏండ్ల అసెంబ్లీలో స్థానం లేని కుర్చీ అంటూ చట్టసభల్లో నాయీబ్రాహ్మణులకు స్థానం దక్కని విషయాన్ని ప్రస్తావిస్తారు. రడం రడమైన పుండ్లకు/పసరు పూసిన తొలి వైద్యులు/చింపిరి ఎంట్రుకల ఎంట్లు కత్తిరించి/ నున్నా బాలు దువ్విన సౌందర్య శాస్త్రవేత్తలు అంటూ దాసోజు లలిత తన 'ఉమ్మ నీటిలో చెమ్మ' అనే కవితలో మంగలి వృత్తిలోని మరో కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు.

తల మాసిన ప్రతి ఒక్కడినీ/ తలెత్తుకు తిరిగేలా చేస్తాడు/ రాజు మొదలుకొని /సామాన్యుని వరకు అతని ముందు తలదించడం /అలిఖిత రాజ్యాంగ ఆదేశ సూత్రం అంటూ కోట్ల వెంకటేశ్వరరెడ్డి క్షురక సంహిత కవితలో అభిప్రాయపడుతాడు. సౌందర్య శాస్త్రానికి ముందుమాట/నీతోనే మొదలవ్వాలి/సన్నాయి ఊది ఊది/సామవేదానికి సరిగమలు నేర్పిన /మంగళకరుడవు నీవు అంటూ నాయీబ్రాహ్మణుల సేవలను మంగళకరుడు కవితలో వివరిస్తారు తగుళ్ల గోపాల్.

తల కొరివి పెట్టేవాడు లేకున్నా నడుస్తుంది కాలం/ కొరిగేవాడు లేకుంటే అందవిహీనమవుతుంది లోకమంటూ వాస్తవికతను వివరిస్తారు తైదల అంజయ్య. చిలుము పట్టిన పొదిని/చంకన పట్టుకొని/అతడు పల్లెపై పున అడుగులేస్తుంటే/కవాతు చేస్తున్న సైనికుడిలా కనిపిస్తాడంటూ బిల్లా మహేందర్ అతడొక శిల్పి అంటూ మెచ్చుకుంటాడు. 'వాడి కత్తెర చప్పుడికి మహిమేదో ఉంది/దేవలోక అందమంత/నేలమీదకు దిగుతుంది. కటింగ్ బేరాలు లేనప్పుడు ఆకలి సన్నాయి రాగంతో తీరుతు ంది అని మెట్టా నాగేశ్వరరావు పల్లె మంగలి కవిత ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

వనపట్ల సుబ్బయ్య
94927 65358

ప్రముఖ కవి ఎన్. గోపి తన 'దిశ' (చుట్టకుదురు సంపుటి) కవితంతా మంగలిదుకాణం వాతావరణంలో నడుస్తుంది. కవి క్షవరానికి వెళ్లినపుడు కవిత్వాలోచనలు వెంటాడుతుంటాయి. గబ్బల శ్రీనివాస్ 'క్షురకుడు' కవితలో వృత్తి నైపుణ్యాన్ని అద్భుతంగా మెరిపించారు. వీరితో పాటు వి .రత్నాకర్ (మట్టిపలక), డా.గౌరవరాజు సతీష్ కుమార్ (క్షౌరం), రాసమొల్ల చంద్రయ్య (పల్లె సేవకులం), మధురశ్రీ మధనం (పల్లె మంగలి), సాయిప్రసాద్ (క్షురకస్వామి), దూడం నాంపల్లి (మంగళప్రదుడు), బాదెపల్లి వెంకటయ్య (క్షౌరశాలలు), వెన్నెల సత్యం (క్షురకుడా), పల్లిపట్టు నాగరాజు (మంగలి ఓ న్యాయం), ఇంకా చాలామంది క్షురవృత్తిని కవితలుగా రాశారు.

> 'చంద్రవంక రాయిమీద /చవురము కత్తినూరి/చముకు చముకు మెరుపు దెస్తావు ఓ మంగళన్నా/ చకిముకి పదును తెస్తావు మంగలి కత్తికి ఓ మంగళన్న' అంటూ ప్రజాకవి గోరటి వెంకన్న మంగలి వృత్తిని గురించి 'ఓ మంగళన్న' పాటలో గొంతెత్తి పాడుతాడు. మిత్ర (అమర్) కూడా మంగలి రామయ్య అంటూ పాటలు రాశారు.

కల్వకోల్ మద్దిలేటి 'మా మంగళన్న', కాకం అంజన్న 'మంగలి',యోచన 'నాయీబ్రాహ్మణులు', కొలకలూరి ఇనాక్ 'తలలేనోడు', రాప్తాడు గోపాలకృష్ణ 'పల్లె మంగలి కథలు' తదితర కథలు, ముదిగంటి సుజాతరెడ్డి 'సంకెళ్లు తెగాయి' నవల, నాటికలు క్షురకుల జీవితాలను, తొలివైద్య ఘనతను, వాయిద్య సొగసులను స్పృశించాయి.

ఇతర కులవృత్తుల మీద వచ్చినా సాహిత్యంతో పోలిస్తే క్షౌరవృత్తిపై వచ్చిన సాహిత్యం చాలా తక్కువ అనే చెప్పాలి. సమాజంలో విభిన్న సేవలందించిన వృత్తి మీద నాలుగు అక్షరాలు రాయటానికి కొంతమంది కవులు ఇష్టపడటం లేదు. రాస్తే కులం గుర్తింపు అంటగడ్తరన్న భయమేమో. ఏదేమైనా మంగళ హృదయంతోరాసిన కవులు, గాయకులు రచయితలు, కథకులకు మంగలిఅసిపె వందనాలు, కత్తి కత్తెర వందనాలు, సన్నాయి మేళాల శనార్తులు.

కల్వకోల్ మద్దిలేటి 'మా మంగళన్న', కాకం అంజన్న 'మంగలి',యోచన 'నాయీబ్రాహ్మణులు', కొలకలూరి ఇనాక్ 'తలలేనోడు', రాప్తాడు గోపాలకృష్ణ 'పల్లె మంగలి కథలు' వంటి కథలు, ముదిగంటి సుజాతరెడ్డి 'సంకెళ్లు తెగాయి' నవల, నాటికలు క్షురకుల జీవితాలను, తొలివైద్య ఘనతను, వాయిద్య సొగసులను స్పృశించాయి.

ఎంత?గంభీరం ఈ సముద్రం

నిశ్చలంగా ఉన్నా
అలలై ఎగసిపడుతున్నా...
జ్ఞాపకాల కెరటాలతో
ఎగిరి పడుతున్నా...
ఆలోచనల స్వాంతనతో
ప్రశాంతంగా ఉన్నా...

కదిలిస్తే అది కల్లోలం
హద్దుదాటితే ఉపద్రవం!
అయినా నిండు కుండై
గుమ్మనంగ ఉంటుంది

ఎంత విశాలం?
ఆమె హృదయ సంద్రం
నేనిచ్చిన వేదనను
తను దిగమింగి నా దరికి చేరి
తెల్లగా మల్లె పువ్వులా నవ్వుతుంది!

ఆటుపోట్ల అలజడిని...
తన హృదయంలో దాచుకుని
ఆత్మీయత పంచే
అమ్మలా తన అంతరంగంలో
నాకు చోటిస్తుంది!!
సముద్రమంత విశాల దృక్పథం
ఆమె....

ఎన్. లహరి
98855 35506

రాత్రి మింగిన స్వప్నం

ఎవరు వ్యక్తీకరిస్తున్నారు ఎవరు ఆర్పుతున్నారు
ఏ కిటికీలోంచి నువ్వు తూర్పుకు చూస్తున్నావు
అటు నుంచి నువ్వు వాళ్లకు ఎలా కనబడతావో!

మూయకు ద్వారాలు కాసిన్ని తూనీగలు రానీ
పైనుంచి ఇంకో కోణం తెర తీయాలి
రాత్రి నిద్రించి పొద్దున్నే విరబూయాలె
సాయంకాలంకల్లా వాడిపోయి రాలకముందే
నిన్ను నువ్వు అంటుకట్టుకోవాలి
వినమ్రంగా రోజూ వెళ్తున్నావా
అడ్డు అదుపు లేని నడక నిలకడ లేని తత్వం
నీ చిరునామాగా ప్రకటించుకోకు!!

నోర్లు అనలే ఊరుకోవు
వాటికి ఎప్పుడూ మాటలే కావాలి
ఎంత మంచిగా పలకరించినా
వాటి లోపలి నాలుకలు ఒప్పుకోవు
వదిలిపెట్టవు నిన్ను విచ్చలవిడిగా
నీకైనా వినసొంపుగా ఉండదు
కాస్త సేద తీరనీ స్థిమిత పడనీ
ఒళ్ళు విరచకు ఆవులించకు
బద్దకంగా శబ్దాలను వెదజల్లకు
కనిపెడుతూ ఉంది ఓ కంట

నీ గూటిలో చిగురించిన వాక్యాలను
ఎప్పుడు ఎక్కడ ఎలా వదిలేయాలో
ఏ నదిలోనో వర్షపు కాలువలోనో
వీలైతే రాత్రి మింగిన స్వప్నాల సాగరంలోనో...
ఇంకేం జరుగుతుంది రోజూ
ఇంకేం మిగులుతుంది రోజూ
కాలం కాలిపోతుంటే కట్టెలపై
ఇక ఉన్నదే పోయేది..
పోతున్నది మూర్ఖత్వమే!!

వగ్గు రఘువీర్

సాహిత్య వికాస పరిషత్

నిజాం పాలనాకాలంలో ప్రారంభమైన ఆనాటి 'నిజాం రాష్ట్రాంధ్ర సారస్వత పరిషత్తు ఈ నాటి 'తెలంగాణ సారస్వత పరిషత్తు' కు సుదీర్ఘమైన చరిత్ర ఉన్నది. నాటి నుంచి నేటి వరకు నిరంతరంగా తెలుగు భాషా సాంస్కృతిక వికాసానికి ఘనమైన సేవలను అవిచ్ఛిన్నంగా అందిస్తూనే ఉన్నది. ఈ పరిషత్తు స్థాపన ఉద్దేశాన్ని చారిత్రక నేపథ్యంలో పరిశీలిస్తే అనేక మధురస్మృతులు గుర్తుకు వస్తాయి.

1930లో 'ఆంధ్ర జనసంఘం' ఏర్పడింది. తదనంతర కాలంలో అది శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆ తర్వాత అది 'ఆంధ్రమహాసభ' గా ప్రకటించుకున్నది. దాని ప్రధానలక్ష్యం రాజకీయ అంశాలకు, హక్కుల సాధన కోసం పోరాటం సాగించటానికే పరిమితమైంది. అందువల్ల తెలుగు భాషా,సాహిత్య వికాసానికి ఆటంకం కలుగుతుందని భావించి, మరో ప్రత్యేక సంస్థ ఉండాలని సభ్యులు భావించారు. ఫలితంగా 1942 మే నెలలో ధర్మవరంలో జరిగిన 9వ మహాసభలో నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాన్ని అనుసరించి 1943 మే 26న 'ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించారు. ఆంధ్ర మహాసభ ప్రాంగణంలోనే మొదటి సమావేశం జరిగింది. దీనికి 'నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అనే పేరు పెట్టారు. దీని ప్రధాన ఆశయం తెలుగు భాషా సంస్కృతుల్ని సుదీప్తం చేయటం. ఆ తర్వాత 1947నుంచి నిజాం రాష్ట్రం అనే పదాన్ని తొలగించి ఆంధ్ర సారస్వత పరిషత్తు అనే పేరుతో కొనసాగుతుంది.

పరిషత్ 1944లో అక్షరాస్యత, వయోజన విద్య కార్యక్రమాలు నిర్వహించింది. అనేక పాఠశాలలు నెలకొల్పి విద్యా వ్యాప్తికి కృషి చేసింది. 1945లో నల్గొండలో పరిషత్తు సభలు జరిగాయి. పరిషత్తు సభ్యులు ప్రతినెల సాహిత్య సమావేశాల పేరుతో పౌరహక్కులను ప్రచారం చేసి స్టేట్ కాంగ్రెసు కార్యకలాపాలకు ఊతం ఇచ్చేవారు. 'నీలగిరి సారస్వత సంఘం' అనే సంస్థను స్థాపించి యువరచయితల రచనలను 'తొలిసంధ్య' అనే పేరుతో ఒక సంకలనాన్ని ప్రచురించారు. ఈ సంస్థ రాజకీయాలకు అతీతంగా తెలుగు సారస్వత అభివృద్ధి కోసం కృషిచేసింది. సంస్థ ప్రధాన కార్యదర్శి బిరుదు శేషయ్య నేతృత్వంలో తెలుగులో ప్రథమ, మధ్యమ, పరీక్షలు నిర్వహించింది. ఈ పరీక్షలకు పాఠ్యపుస్తకాలను కూడా నిర్ణయించారు. ఈ పరీక్షలు అనేకమందిని ఆకర్షించాయి.

డా కోలాహలం రామ్ కిశోర్
98493 28496

సారస్వత పరిషత్తు ప్రాచీన సాహిత్య గ్రంథాలను సేకరించి ప్రచురించింది. మాండలిక పదకోశాలను తయారు చేసింది. తెలుగు రచయితలను వెన్నుతట్టి ప్రోత్సహించి అనేక అద్భుత గ్రంథాలను ప్రచురించి తెలుగు భాషాభిమానుల పఠన దాహర్తిని తీర్చింది. మొదట సురవరం ప్రతాపరెడ్డి రాసిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకానికి తెలుగు భాషలో తొలిసారిగా కేంద్ర సాహిత్య పురస్కారం లభించింది. మహాభారతం, భాగవతం, ఆంధ్ర భాష, సాహిత్యం, సంస్కృతిపై అనేక ఉపన్యాసాలను ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచే ఇప్పించింది. ఈ ఉపన్యాసాలకు 'పరిణిత వాణి' అనే పేరు పెట్టింది. దేవులపల్లి రామానుజరావు, గడియారం రామకృష్ణశర్మ, బూర్గుల రంగనాథం సంస్థ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర నిర్వహించి సారస్వత పరిషత్ అభివృద్ధికి ఎనలేని కృషిచేశారు.

> సారస్వత పరిషత్తుకు దేవులపల్లి రామానుజాచార్యులు 50 ఏండ్లపాటు అధ్యక్షులుగా విశేష సేవలు అందించారు. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. దీంతో 2015 లో ఆంధ్ర సారస్వత పరిషత్తు పేరును తెలంగాణ సారస్వత పరిషత్తుగా మార్చారు.

దేవులపల్లి తర్వాత జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సీ నారాయణరెడ్డి 1993 నుంచి అంతిమశ్వాస వరకు 25 ఏండ్ల పాటు అధ్యక్షులుగా ఉండి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రస్తుతం ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షులుగా, డాక్టర్ జుర్రు చెన్నయ్య ప్రధాన కార్యదర్శిగా పరిణితవాణి ప్రసంగాలు కొనసాగిస్తున్నారు. ఉత్తమ గ్రంథాల ప్రచురణ,ఉత్తమ గ్రంథాలకు బహుమతులు, వివిధ రంగాలలో యువతకు సృజనాత్మక రచనపై అధ్యయన శిబిరాలు, సదస్సులు, కళలు, ఉత్సవాలు మొదలైన వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

తెలంగాణ 33 జిల్లాల చరిత్ర-సంస్కృతి, సాహిత్యం కళలు మొదలైన అంశాలతో సమగ్ర గ్రంథాలను వెలువరిస్తూ తనదైన శైలిలో తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిని నలుదిశలా చాటుతూ ఘనమైన సేవలు నేటికీ అందిస్తూనే ఉన్నది.

మానసిక సంపూర్ణత్వానికి కళ

'కవిత్వం అవసరమే ..కానీ ఎందుకో తెలిస్తే !' అని ఓ రచయిత ఛలోక్తి విసిరాడు . మోండ్రియాన్ అనే చిత్రకారుడు యదార్థం క్రమేణా కళను తొలగించి దాని స్థానాన్ని ఆక్రమిస్తుందని అభిప్రాయపడ్డాడు. యదార్థంలో లోపించిన సమతుల్యతకు ప్రత్యామ్నాయంగా కళ జనిస్తుందనేది అతని వాదన. అయితే కళ ఆవశ్యకత ఎల్లప్పుడూ ఉంటుంది.

జీవిత ప్రత్యామ్నాయంగా కళ, మనిషి చుట్టూ ఉన్న ప్రపంచంతో ఒక సమతుల్యతను ఏర్పరుస్తుందనే భావన కళ స్వభావాన్ని, దాని అవశ్యకతను రేఖామాత్రంగా సూచిస్తోంది. ఈ భావన గతంలో కళ ఎంత అవశ్యకమో, నేటికీ అంతే అవసరమని నొక్కి చెబుతోంది. కళ మనిషికీ, జగత్తుకూ మధ్యగల అనుబంధాన్ని వ్యక్తీకరిస్తుంది. మనిషి ఆంతరంగిక అవసరాలను కళ సంతృప్తి పరుస్తోంది .

చాలామంది పుస్తకాలను చదువుతారు, సంగీతాన్ని ఆనందిస్తారు, సాహిత్యాన్ని ఆస్వాదిస్తారు. వారు మానసిక ప్రశాంతతను, వినోదాన్ని ఇలా కళను అనుభవించడం ద్వారా పొందుతారు. సాహిత్యాన్ని చదివే సమయంలో ఎందుకు వారు ఆ సాహిత్యంలోని పాత్రలతో తా దాత్మ్యం చెందుతారు? ఆ పాత్రల సమస్యలకు, సవాళ్లకు ఎందుకు స్పందిస్తారు? ఆ సాహిత్యంలోని జీవితం వాస్తవం కానప్పటికీ, ఆ కల్పనను గాఢమైన యదార్థంలా ఎందుకు అనుభూతి చెందుతారు ? ఇందులో ఎలాంటి విచిత్రమైన వినోదం, ఆనం దం దాగి ఉంది? అంటే ఒక వేళ మనం మన జీవితం నుంచి ఆ కల్పనిక ప్రపంచంలోకి వెళ్ళి మనలను మనం మర్చిపోతాం అని సమాధానం చెప్పవచ్చు. అప్పుడు ఎందుకు మన జీవితం మనకు సరిపోవడం లేదనే ప్రశ్న వస్తుంది. ఇతర కాల్పనిక పాత్రలను చిత్రీకరింపబడిన జీవితాన్ని చదువటం వల్ల మన జీవితంలోని పరిమితులను, అసంతృప్తిని ఎలా పోగొట్టుకుంటున్నాము అనే ప్రశ్న కూడా వస్తుంది.

ఇందుకు సమాధానంగా మనిషి తన జీవిత పరిమితులను అధిగమించి ఓ సంపూర్ణత్వం పొందేందుకు, సాహిత్యాన్ని సాధనంగా ఉపయోగిస్తున్నాడు అని చెప్పవచ్చు. అతను తన జీవిత పరిమితులను, బలహీనతలను అధిగమించి, తనను తాను మరింత బలవత్తరం చేసుకునేందుకు సాహిత్యం ఉత్తేజం కలిగిస్తుందని చెప్పవచ్చు.తాను ఇతరులతో, వారి జీవితాలతో తాదాత్మ్యం చెంది, తన సొంత వ్యక్తిగత సమస్యల నుంచి ఊరట పొందుతాడు.తాను వ్యక్తిగా చేయలేనివి, సాహిత్యంలోని పాత్రల నుంచి స్వీకరించి, ప్రేరణ పొంది సంతృప్తి చెందుతాడు. తాను తన ఏకాకితనం నుంచి, సమాజ సమూహంతో మమేకం చెందడం ద్వారా, సంపూర్ణత్వాన్ని పొందుతాడు. తాను ఇతరులతో కలిసి ఉండాలనే సామాజిక వాంఛ నుంచి ఇలా సాహిత్యం నుంచి, జీవితంతో అనుబంధం ఏర్పరుచుకోవడం ద్వారా ఆనందాన్ని పొందుతాడు.

కళ వ్యక్తిని అతని జీవితం నుంచి తాత్కాలికంగా వేరుపరిచి, ఒకరకమైన మాంత్రిక స్థితిని సృష్టిస్తుంది. వ్యక్తి తన నుండి తాను వేరుపడి, ఆ కాల్పనిక ప్రపంచంతో తాదాత్మ్యం చెందడం ద్వారా, తిరిగి తన శక్తిని పుంజుకుంటాడు. ఆ స్థితి తాత్కాలికమే అయినప్పటికీ అది అతనికి ఎంతో ఆనందం కలిగిస్తుంది. కళను మనిషి వ్యక్తిగతంగా ఆస్వాదించినా, అందులో విశ్వజనీనమైన అనుభూతిని పొందుతాడు. అలా కళ మనిషిని తన పరిమితులను అధిగమించి, ఒక సంపూర్ణత్వం పొందేలా దోహద పడుతుంది. మనిషిని సమాజంతో ఐక్య పరుస్తుంది. తనకు ప్రపంచానికి మధ్య ఓ నిరంతర సమతుల్యత సాధించేందుకు ప్రేరేపిస్తుంది. అందువల్లే మనిషి కళ నుంచి ఆనందం పొందుతాడు. కళలను ఆస్వాదిస్తాడు, కళ మనిషికి అన్ని కాలాల్లోనూ అవసరం. కళ మనిషిని మనీషిగా మలుస్తుంది !

దండమూడి శ్రీ చరణ్
98661 88266

కలం పిలుపు

కవితా సంపుటి ఆవిష్కరణ

బాణాల శ్రీనివాసరావు కవితాసంపుటి 'రాత్రి సింఫని' ఆవిష్కరణ నవంబర్ 5న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరుగుతుంది. జూలూరు గౌరీశంకర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో గుంటూరు లక్ష్మినరసయ్య, సిద్ధార్థ, గుడిపాటి, సంగిశెట్టి శ్రీనివాస్, ఏనుగు నర్సింహారెడ్డి, ఎస్ .రఘు పాల్గొంటారు. - పాలపిట్ట బుక్స్

రంగినేని ఎల్లమ్మ పురస్కారం

రంగినేని ఎల్లమ్మ జాతీయ పురస్కారం-2023 కోసం కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురితమైన సంపుటాలు ఐదు ప్రతులను నవంబర్ 15లోగా అధ్యక్షులు, రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం, రంగినేని సుజాతామోహన్‌రావు ఎడ్యుకేషనల్ ట్రస్ట్, బాలాజీ నగర్, సిరిసిల్ల, రాజన్నసిరిసిల్ల జిల్లా-505301 చిరునామాకు పంపాలి. -రంగినేని ట్రస్ట్, అవార్డు కమిటీ

తొలినవలా పురస్కారం

కొత్తగా నవలలు రాసే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ నవలలను ఆహ్వానిస్తున్నది. నవల ప్రింట్‌లో 100 పేజీలు తగ్గకుండా, 250 పేజీలు మించకుండా ఉండాలి. 2019-2022 మధ్యకాలంలో రచించిన నవలలను అక్టోబర్ 31లోగా డి.స్వప్న, కార్యదర్శి, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు, 2-7-71, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్-506001 చిరునామకు పంపాలి.
-అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు